క్లుప్తంగా

ఎన్జీ కళాశాలలో నృత్య పోటీలు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, కల్చరల్ కమిటీ ఇన్చార్జ్ లవీందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మునీర్, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, లైబ్రేరియన్ దుర్గా ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అనసూయమ్మ మృతదేహానికి బుధవారం నల్లగొండలోని సావర్కర్‌నగర్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే భగత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనసూయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మండల అభివృద్ధికి కృషి


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్రిగూడ : మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శివన్నగూడ గ్రామంలో రూ.4.5లక్షల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, సర్పంచ్ చిట్యాల సబితయాదగిరిరెడ్డి, ఎంపీటీసీలు దాసరి మమతగోపాల్, ఊరిపక్క సరితనగేష్, ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, ఉప సర్పంచ్ సంకబుడ్డి మమతనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట


వట్టిమర్తిలో బడిబాటలో పాల్గొన్న సిబ్బంది

చిట్యాల : మండలంలోని ఆరెగూడెం, వట్టిమర్తి గ్రామాల్లో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మూడేళ్ల లోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలంటూ ప్రచారం నిర్వహించారు. వట్టిమర్తిలో ఉప సర్పంచ్ సాగర్ల నరేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, ఇందిరా, ఏఎన్‌ఎం విజయ, ఆరెగూడెంలో సర్పంచ్ అర్రూరి లాలమ్మ స్వామి, అంగన్‌వాడీ టీచర్లు నవనీత, కవిత పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు తెలంగాణ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించడంతో బుధవారం విద్యార్థులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అదే విధంగా చెర్వుగట్టు పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వలంటీర్ల వేతనానికి సర్పంచ్ బాలకృష్ణ సొంతంగా రూ.30 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి


మాట్లాడుతున్న నర్సింహగౌడ్

మర్రిగూడ : కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్ కార్యకర్తలను కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీలు, గ్రామ కమిటీలను త్వరలో ఎన్నుకుంటారని అన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క తిరుపతయ్య, ఉపాధ్యక్షుడు రామిడి యాదగిరిరెడ్డి, సుధాకర్‌రావు, సిద్దాపురం జంగయ్య, మాదగోని కృష్ణయ్య, బండ యాదయ్య, కొట్టం శ్రీనివాస్, పగిళ్ల యాదయ్య, ఎండి.జమీర్, సిరిపంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు!

- మన ఊరు- మన బడి కార్యక్రమంలో మౌలిక వసతుల కల్పన
- నాణ్యమైన విద్య, ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం
- తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

కనగల్ : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు సమకూరుస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమం కింద పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడంతోపాటు విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు సమకూరుస్తోంది. దీనికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా యూనిఫాం, పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విద్య, సౌకర్యాలపై ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు.

కనగల్ మండలంలో ఇలా..

మండల వ్యాప్తంగా మొత్తం 53 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 7 ఉన్నత, 1ఆదర్శ పాఠశాల, 1 గురుకుల, 1 కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. శేరి లింగోటం, చెట్లచెన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గోగుబుచ్చయ్యగూడెం, మంచినీళ్లబావి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో గతంలోనే ఈ పాఠశాలలను మూసివేశారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 3779 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.


కురంపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పదిలో ఉత్తీర్ణత శాతం ఇలా..

మండల వ్యాప్తంగా 7ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలు ఉన్నాయి. మొత్తం 340 మంది విద్యార్థులకు గాను 253 మంది గత విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించారు. ఇందులో చర్లగౌరారం ఉన్నత పాఠశాలలో 13 మంది విద్యార్థులకు 10 మంది. చినమాదారం పాఠశాలలో 52 మందికి 47, దోరెపల్లిలో 16 మందికి 10, జి యడవల్లిలో 20 మందికి ఐదుగురు, కనగల్‌లో 60 మందికి 47, కురంపల్లిలో 20మందికి 16, రేగట్టెలో 21మందికి 18, ఆదర్శ పాఠశాలలో 99 మందికి 74, కేజీబీవీలో 39మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులు, మౌలిక వసతులు ఉన్నా యి. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులను ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధిస్తున్నారు.

– రాంగిరి శ్రీధర్‌రావు, వైస్ ఎంపీపీ, తుర్కపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండడం వల్ల విద్యార్థులు మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

– తరి రాములు. ఎంఈఓ, కనగల్

కేసీఆర్ ఆలోచనతోనే సాగునీటి రంగంలో అభివృద్ధి


సాగునీటి ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

- సాగునీటి దినోత్సవంలో నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కేసీఆర్ అద్భుత ఆలోచనలతో సాగునీటి రంగంలో అపారమైన అభివృద్ధి సాధించామని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మర్రిగూడ బైపాస్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించి సాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం సాగు, తాగునీటికి జిల్లా ప్రజలు ఎన్నో కష్టాలు పడేవారని, మంచినీళ్ల కోసం కిలోమీటర్లు నడిచిపోయే పరిస్థితి ఉండేదన్నారు. కాలువ కింద ఒక పంటకే నీరు, నాన్ ఆయకట్టులో కరెంటు లేక పైర్లు ఎండిపోయిన పరిస్థితి ఉండేదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత మిషన్‌కాకతీయ ద్వారా చెరువుల్లో పూడిక తీయడం ద్వారా చెరువుల్లో నీరు చేరి భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల సాగు పెరిగిందన్నారు. కృష్ణాజలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా తీసుకురావడం వల్ల రెండు పంటలకు సాగునీరు అందుతోందన్నారు. మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్న ప్రభుత్వం ఒక్క తెలంగాణ ప్రభుత్వమే అన్నారు. రెండు పంటలకు సాగునీరు ఇవ్వడంతోపాటు రైతాంగానికి 24గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల నల్లగొండ నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం దిగుబడి సాధించిందని అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో డీ 37, 39, 40, 25 ద్వారా ఇందుగుల, సర్వారం, ఆగామోత్కూర్ వరకు కృష్ణాజలాలు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా కన్నెకల్ చిన్నమాదారం, ముషంపల్లి, చెరువులు కూడా కృష్ణజలాలతో నిండాయన్నారు. ఉదయ సముద్రానికి కృష్ణా జలాలు రావడంతో నియోజవర్గంలో తాగునీటి సమస్య తీరిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు 3 సంవత్సరాల్లోనే పూర్తి చేసి కేసీఆర్ చరిత్ర సృష్టించారన్నారు. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. అంతకుముందు సాగునీటి శాఖకు సంబంధించి పుస్తకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, ఎంపీపీ కరీం పాష, విజయలక్ష్మి, టీఎస్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నీటిపారుదల అభివృద్ధి శాఖ ఇంజనీర్లు, జేవీ సత్యనారాయణ, వెంకటేశం, ఆనంద్‌రావు, నాగయ్య, డీఈఓ విఠల్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన అధికారులు, సిబ్బంది, రైతులు

తెలంగాణ ఏర్పాటుతో మునుగోడు సస్యశ్యామలం


ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

- సాగునీటి దినోత్సవంలో మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

చండూరు : మునుగోడు ప్రాంతం 2014 సంవత్సరానికి ముందు ఎడారిలా ఉండేదని, తెలంగాణ ఏర్పాటుతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి, అమర వీరులకు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ముందు సాగు, తాగు నీరు లేక మునుగోడు ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు, తాగు నీటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపిందని అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయతో మునుగోడు ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. నియోజకవర్గంలో 485 చెరువుల పునర్నిర్మాణానికి రూ.73 కోట్లు ఖర్చు చేశామన్నారు. శివన్నగూడెం, చెర్లగూడెం, కిష్టరాయినపల్లి ప్రాజెక్టులను ప్రారంభించామన్నారు. రాష్ట్ర గీత కార్మిక సహకార, కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు తర్వాతనే పల్లెలు అభివృద్ధి చెందాయన్నారు. 2014 కు ముందు మునుగోడు ప్రాంతంలో అభివృద్ధి జరలేదని, ఆ తర్వాత అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్ర కళ వెంకన్న, డీఈ ఖాసీం, ఎంపీపీలు పల్లె కళ్యాణి, మెండు మోహన్‌రెడ్డి, ఉమా, కర్నాటి స్వామి, శ్వేత, జెడ్పీటీసీలు పాశం సురేందర్ రెడ్డి, భానుమతి, కోడి వెంకన్న, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


హాజరైన ప్రజలు

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రామగిరి(నల్లగొండ) : సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న హమాలీలకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవన్‌లో ఎగుమతి దిగుమతి హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు ప్రభుత్వం రూ. 6 వేల పెన్షన్ ఇవ్వాలని, కనీస వేతనం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మార్కెట్ యార్డు, సివిల్ సప్లయ్, బేవరేజస్, ఎలక్ట్రిసిటీ స్టోర్, ఎఫ్‌సీఐ, వేర్ హౌజింగ్ కార్పొరేషన్ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ ఐఎల్‌ఓ తీర్మానం ప్రకారం 50 కిలోలు మించిన బరువులను నిషేధించాలన్నారు. హమాలీ యూనియన్ అధ్యక్షుడు నరాల పెద్ద వెంకన్న, చిన్న వెంకన్న, సైదులు, మధు, నవీన్, శేఖర్, వెంకన్న, వీరయ్య, రాజీవ్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం ఈ నెల 11న యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో జరిగే ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఉమ్మడి నల్లగొండ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎంఎస్పీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం ఎదుట మహాసభల కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి తీసుకువచ్చి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి బకరం శ్రీనివాస్‌మాదిగ, బోడ సునిల్‌మాదిగ, ఇరిగి శ్రీశైలం మాదిగ, బొజ్జ దేవయ్యమాదిగ, కత్తుల సన్నీ, తరకొప్పులరాజు, బొజ్జ నాగరాజు, బీపంగి అర్జున్, బీపంగి యాదయ్య, వంగూరు మల్లేషం, కత్తుల శ్రీకాంత్, పెరిక రవి, హరిబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎస్పీ నాయకులు

దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి నిర్వహించే సంక్షేమ సంబరాలు, మహిళా సంక్షేమ సంబరాలను అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు బాధ్యతగా ఏర్పాట్లను చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మినగేష్, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో ఎల్లమ్మ గుడి నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం చందుపట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆలకుంట్ల వెంకన్న ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు బాసటగా నిలవాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించారని తెలిపారు. తదుపరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాగి ఎల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, నాయకులు పెండెం సదానందం, కొండ శ్రీను, నడికుడి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

తుల శ్రీనివాస్‌కు వెన్నెల సాహితీ పురస్కారం


తుల శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ): జిల్లాకు చెందిన ప్రముఖ కవి తుల శ్రీనివాస్‌కు 2022 సంవత్సరానికి గాను జాతీయ స్థాయి వెన్నెల సాహితీ పురస్కారం లభించింది. శ్రీనివాస్ రచించిన వచన కవితా సంపుటి చింతల తొవ్వను సిద్దిపేట జిల్లాకు చెందిన వెన్నెల సాహితీ సంఘం వారు పురస్కారానికి ఎంపిక చేశారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్, డాక్టర్ ఉదారి నారాయణ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. త్వరలో సిద్దిపేటలో జరిగే అవార్డు ప్రదానోత్సవంలో పురస్కారం అందజేయనున్నారని శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం రావడంపై జిల్లాకు చెందిన కవులు మునాసు వెంకట్, పెరుమాళ్ళ ఆనంద్, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, డాక్టర్ మండల స్వామి, భాను శ్రీ కొత్వాల్, ఉప్పల పద్మలు అభినందనలు తెలిపారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న మాదగోని శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టూటౌన్ : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గత 9 సంవత్సరాల్లో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మోర్చాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని, మోర్చాలు సంయుక్త సమ్మేళనం నిర్వహించాలని కోరారు. గత తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, దాయం భూపాల్‌రెడ్డి, నాగం వర్షిత్ రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, భిక్షం, సిద్ధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుర్గ, వీర నారాయణమ్మ, నాగలక్ష్మి, నజియా సుల్తానా, యుగేందర్‌రెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ, భాస్కర్, రమేష్, లింగస్వామి, రవి, సత్తి, భరత్ భూషణ్‌రెడ్డి, కర్ణకుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితమా !

మునుగోడు : గత ఏడాది జూలై మాసంలో కురిసిన భారీ వర్షాలకు మునుగోడు–నల్లగొండ ప్రధాన రహదారి రైస్ మిల్లుల సమీపంలో కిలో మీటరుకు పైగా ధ్వంసమైంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే క్రమంలో అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతు పనులకు అంచనాలు తయారు చేసి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అదే ఏడాది డిసెంబర్ మాసంలో ఫ్లడ్ డ్యామేజ్ నిధుల నుంచి రూ. కోటి 25 లక్షల నిధులు మంజూరుచేసి టెండర్లు పిలిచారు. ఆ టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్ వెంటనే పనులు ప్రారంభించకుండా ఆలస్యం చేయడంతో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని అధికారులపై వత్తిడి తీసుకొచ్చి పనులు చేసేలా చొరవచూపారు. ఈ క్రమంలో గత నెల 15వ తేదీన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. కానీ నేటికీ ఆ పనులు మొదలుపెట్టలేదు. మరో 10, 15 రోజుల్లో వర్షాలు కురిస్తే రోడ్డు పనులు చేయడం చాలా ఇబ్బంది అవుతుంది. అయినా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌తో పనులు మొదలు పెట్టించకుండా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు మొదలు పెట్టించి వర్షాలు కురిసేలోపు పనులు పూర్తి చేయించాలని వాహనదారులు వేడుకుంటున్నారు.


పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి (ఫైల్)

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంపీటీసీ సుక్క జ్యోతి సైదులు అన్నారు. బుధవారం మండలంలోని నారెగూడెం గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు కృష్ణ, అమీద్ పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి

మునుగోడు : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న చెరువుల పండుగను విజయవంతం చేయాలని డీఆర్‌డీఓ కాళిందిని కోరారు. బుధవారం మునుగోడు పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లపై స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం సమయంలో దేవతలకు పూజలు నిర్వహించాలని, సాయంత్ర సమయంలో బతుకమ్మ, బోనాలతో ఊరేగింపుగా చెరువు వద్దకు వెళ్లి సహపంక్తి భోజనాలు చేయాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ శ్రీనయ్య, పంచాయతీ కార్యదర్శి మురళి, టెక్నికల్ అసిస్టెంట్ నాగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామల తదితరులు ఉన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

మాడుగులపల్లి: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండలంలోని గురప్పగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన డిగ్రీ మిత్రులతో కలిసి ఆలయానికి హుండీని బహూకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కర్ర ఇంద్రారెడ్డి, డాక్టర్ విక్రమ్‌రెడ్డి, రమేష్, రఘునందన్, కోమటిరెడ్డి, రాజేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అన్నప్రాసన


చిన్నారికి అన్నప్రాసస చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ కల్పన

మాడుగులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు సామూహిక అన్నపాసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గడ్డమీది సైదులు సైతం తన కుమారుడు సాద్విక్‌కు అంగన్‌వాడీ కేంద్రంలోనే అన్నప్రాసన జరిపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కల్పన, ఆయా నవ్య, వెంకన్న, జగన్, రంగారావు, సైదులు, మంగమ్మ, నర్మద, స్వరూప, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు రెండు ఇళ్ల పైకప్పులు ధ్వంసం

మర్రిగూడ : ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా బుధవారం మండలంలోని వట్టిపల్లిలో రెండు ఇళ్ల పై రేకులు ధ్వంసమయ్యాయి. గ్రామానికి చెందిన బూరల మల్లేష్, సయ్యద్ బషీర్‌కు చెందిన ఇళ్ల పైకప్పు రేకులు పూర్తిగా ధ్వంసం కావడంతోపాటు ఇంటిలోని వంట సామగ్రి, పలు వస్తువులు దెబ్బతిన్నాయి. సయ్యద్ బషీర్ కుటుంబంలోని బషీర్, జాని, చిన్నారి అలీబాబాలకు గాయాలు కాగా మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.


వట్టిపల్లిలో ధ్వంసమైన ఇంటి పైకప్పు రేకులు